ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





వర్షమొస్తే అంతే సంగతులు !

- శిథిలావస్థలో దేవరాపల్లి బిసి వసతి గృహం
- కారుతున్న గదులు.. ఊడిపోయిన కిటికీలు
- విద్యార్థులకు పాములు, విషపురుగుల భయం



శిథిలావస్థకు చేరిన గది

ప్రజాశక్తి - దేవరాపల్లి : వర్షం వస్తే అక్కడి విద్యార్థులు బితుకుబితుకుమనడమే. శీతాకాలమైతే గజగజ వణకడమే. మల, మూత్ర విసర్జనలకు ఆరుబయటకు వెళ్లాల్సిందే. ఇవీ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల కేంద్రంలోని బిసి వసతి గృహ విద్యార్థుల దయనీయ పరిస్థితి. ఈ వసతి గృహంలో 71 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మూడే బాత్రూంలు, నాలుగు స్నానపు గదులే ఉన్నాయి. వాటిలోనూ సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పునర్నిర్మాణానికి నోచుకోని మరుగుదొడ్లు

వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. నాలుగు గదుల్లో రెండు పూర్తిగా శిథిల దశకు చేరాయి. వర్షం వస్తే కారిపోతున్నాయి. గదుల్లోని కిటికీలు పూర్తిగా పోవడంతో చలికాలం విద్యార్థులు వణికిపోతున్నారు. విష పురుగులు, పాములు వస్తాయేమోనన్న మిగతా 2లో..



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్.శర్మ, తెలకపల్లి రవి, సత్యాజీ, దివాకర్ తదితరులు

'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ

వార్త 2లో..

డ్రగ్స్ కలకలం

పోలీసుల అదుపులో వైసిపి యువ నాయకుడు సహా గీతం విద్యార్థి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్ కలకలం రేపాయి. దురంతో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వద్ద అవి పట్టుబడ్డాయి. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన యువకుడు చరణ్ బెంగళూరు నుంచి విశాఖకు డ్రగ్స్ తీసుకువస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఈగల్ టీం, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం ఉదయం విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకొని దురంతో ఎక్స్‌ప్రెస్ విశాఖకు రాగానే చరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనున్న బ్యాగును తనిఖీ చేయగా 34 ఎల్ఎస్‌డి బ్లాట్స్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతన్ని పలు కోణాల్లో విచారించారు. ఈ డ్రగ్స్‌ను విశాఖకు చెందిన వైసిపి స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు కొండారెడ్డి కోసం తీసుకువచ్చానని నిందితుడు చెప్పాడు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మద్దిలపాలెంలో నివాసముంటున్న కొండారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. డ్రగ్స్‌ను నగరంలోని కొంతమంది వ్యక్తులకు సరఫరా చేయాలనే ఉద్దేశంతో తీసుకొచ్చినట్లు మిగతా 2లో..

లోపలి పేజీల్లో..

ఆకట్టుకున్న పుస్తక మహోత్సవం

నేడు హరనాథ్ సంస్మరణ సభ

మొదటి పేజీ తరువాయి..

డ్రగ్స్ కలకలం

ఆయన విచారణలో ఒప్పుకున్నాడు. వాటిని గీతం కళాశాలలో చదువుతున్న హర్షవర్ధన నాయుడుకు, నగరానికి చెందిన శరత్‌కు, హైదరాబాద్‌కు చెందిన సంతానం అనే వ్యక్తికి సరఫరా చేయడానికి తెప్పించానని విచారణలో వెల్లడించాడు. దీంతో పోలీసులు కొండారెడ్డి, హర్షవర్ధన్ నాయుడు, శరత్, చరణ్‌లను అరెస్టు చేసి నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన సంతానం పరారీలో ఉండగా టాస్క్ ఫోర్స్ బృందం అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రాజకీయ లింకులు

ఈ కేసులో రాజకీయ కోణం కూడా వెలుగులోకి వస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకులతో కొండారెడ్డికిగల సంబంధాలపై అధికారులు దృష్టి సారించారు. పట్టుబడ్డ మాదకద్రవ్యాల నమూనాలను విశ్లేషణకు పంపించారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అణచివేయడమే లక్ష్యంగా కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్, ఈగల్ టీమ్ అధికారులు స్పష్టం చేశారు.

వర్షమొస్తే అంతే సంగతులు !

భయాందోళన వారిని నిత్యం వెంటాడుతోంది. గతంలో హాస్టల్లో తొమ్మిది బాత్రూములు ఉండేవి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో ఆరింటిని నెలరోజుల క్రితం పూర్తిగా తొలగించారు. పునర్నిర్మాణం చేపట్టలేదు. విద్యార్థులు బట్టలు ఉతుక్కోవడానికి సరైన సదుపాయాలు కరువయ్యాయి. ప్రహరీ గోడ పడిపోయి ఏడాది దాటుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. 71 మంది విద్యార్థులు పడుకోవటానికి 18 బెడ్లు మాత్రమే ఉండటంతో ఎక్కువమంది నేలపైనే పడుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ హాస్టల్ దుస్థితి మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నా ఎవ్వరికీ పట్టడం లేదన్నారు.

ప్రభుత్వ నిధులు వస్తే సమస్యలు పరిష్కారం

దోమతెరలు, రగ్గులను పూర్తిస్థాయిలో విద్యార్థులకు ఇచ్చాం. వసతి గృహ సమస్యలపై అధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారమవుతాయి.

- లక్ష్మీనారాయణ, ఇన్‌ఛార్జి వార్డెన్

నేడు హరనాథ్ సంస్మరణ సభ

ప్రజాశక్తి -మాధవధార : ఇటీవల మృతిచెందిన ప్రముఖ న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్ సంస్మరణ సభ సోమవారం కంచరపాలెంలోని కాయితి పైడయ్య కల్యాణ మండపంలో జరుగనుందని కుటుంబ సభ్యులు తెలిపారు. హరనాథ్ విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐలలో చురుకుగా పనిచేశారు. కంచరపాలెం ప్రాంతంలో యువజన సంఘాన్ని ఏర్పాటుచేసి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. కంచరపాలెం ప్రాంతంలో ఉన్న విఆర్ చిట్స్ బాధితులకు అండగా పలు న్యాయ సూచనలు ఉచితంగా అందించారు. హరనాథ్ సంస్మరణ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా నాయకులు బి.పద్మ, మాజీ కార్పొరేటర్ బి.ఈశ్వరమ్మ హాజరుకానున్నారు.

7న రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 7న విశాఖ నగరంలో ఉదయం 10 గంటలకు సరస్వతీ పార్క్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు సిఐటియు ఆధ్వర్యంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులందరూ రెడ్ షర్టు, రెడ్ శారీలతో పాల్గొనాలని కోరారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు మొట్టమొదటిసారిగా విశాఖ నగరంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్నాయన్నారు. దేశం నలుమూలల నుండి 1500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. చివరి రోజైన జనవరి 4న లక్ష మంది కార్మికులతో భారీ ప్రదర్శన, సభ ఉంటాయన్నారు. వీటిని జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 7న 'రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు' జరుగుతుందని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన విజిలెన్స్ అవేర్‌నెస్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జోనల్ ఆఫీస్ రీజినల్ ఆఫీస్, విశాఖపట్నం సిబ్బంది ఆధ్వర్యంలో విజిథాన్ (వాక్‌ఆన్) కార్యక్రమం ద్వారకానగర్ జోనల్ ఆఫీసు ప్రాంతంలో నిర్వహించారు. కార్యక్రమం జోనల్ హెడ్ శాలిని మెనన్, రీజినల్ హెడ్ జె.సింహాచలం జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఐ.వి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. జోనల్ హెడ్ శాలినిమెనన్ మాట్లాడుతూ, వృత్తిపరమైన జీవితంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా విజిలెన్స్ ఎంత ముఖ్యమో వివరించారు. అవినీతి రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిజాయితీ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

భక్తుల మృతి కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఊపిరాడక, కింద పడి నలిగిపోయి తొమ్మిది మంది మరణించడం, అనేకమంది తీవ్రంగా గాయపడడం తీవ్ర బాధాకరమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు జె.రవి, టి.శ్రీరామమూర్తి పేర్కొంటూ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ మధ్యనే హరిముకుంద పండా అనే వ్యక్తి నిర్మించిన ఈ ప్రైవేట్ ఆలయంలో సరైన బారికేడ్లు లేకపోవడం, రాకపోకలకు ఒకే మార్గాన్ని నిర్మించడం, భద్రతా సిబ్బంది, వాలంటీర్లు లేకపోవడం, రద్దీ పెరుగుతోందని తెలిసి కూడా పోలీసులకు తెలియ పరచకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలు మీడియా ద్వారా తెలిసాయని పేర్కొన్నారు.

'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ

- ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావులకు నివాళి



మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ సభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక మేనేజర్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. సంకలనంలో చోటుచేసుకున్న కవులను ప్రోత్సహించిన విధానాన్ని తెలియపరుస్తూ వారిని సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంకలనంలో భాగమైన కీర్తిశేషులు ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావుల సంస్మరణ సభలో ఈ పుస్తకాన్ని అవిష్కరించడం వారికిచ్చే గొప్ప నివాళి అని పేర్కొన్నారు. వారి సేవాతత్పరతను, సాహిత్య పటిమను కొనియాడారు. అనంతరం 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యాజీ ఈ సంకలనంలోని కవితలను భిన్న కోణాల్లో విశ్లేషించి, వివరించారు. ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావుల ప్రస్థానాన్ని, సాహిత్య రంగంలో వారు అందించిన సేవలను కొనియాడారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి విశాఖ కవులను ఉద్దేశిస్తూ విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకృష్ణ, ప్రముఖ నటులు, దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్‌తో పాటు పలు సాహితీ, కళా సంఘాల ప్రతినిధులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, సాహితీ స్రవంతి సభ్యులు పాల్గొన్నారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు, కోశాధికారి జి.సుబ్బరాజు, జివిఎన్.చలపతి, కె.స్వతంత్ర కుమార్‌లను సత్కరించారు.

కార్తీకానికి ప్రత్యేక బస్సులు

- ప్రయాణికుల భద్రతకు పెద్దపీట
- తరుచూ తనిఖీలు
- 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు





ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలను దర్శించే భక్తుల ప్రయోజనం కోసం పంచారామ క్షేత్ర దర్శిని పేరుతో ప్రత్యేక బస్సులను ఆర్‌టిసి నడుపుతున్నట్లు సంస్థ విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు తాము పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇటీవల తనను కలిసిన 'ప్రజాశక్తి'కి పలు విషయాలు వెల్లడించారు.

కార్తీక మాస బస్సుల వివరాలు తెలియజేస్తారా ?

కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంకాలం 5 గంటలకు ద్వారకా బస్సు స్టేషన్ నుండి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. సోమవారం అమరావతి (శ్రీ అమరేశ్వరుడు), భీమవరం (శ్రీ భీమేశ్వరుడు), పాలకొల్లు (శ్రీ క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (శ్రీ భీమలింగేశ్వరుడు), సామర్లకోట (శ్రీ కుమార రామలింగేశ్వరుడు) శైవక్షేత్రాలను దర్శించుకోవచ్చు. బస్సుల వివరాలు ద్వారకా బస్ స్టేషన్‌లో తెలుసుకోవచ్చు. అలాగే ఈ మాసంలో ఏ రోజైనా కూడా ప్రయాణికుల కోరిక మేరకు ఈ పంచారామాల స్పెషల్ బస్సులు నడపబడతాయి.

టికెట్ ఛార్జీలు ఎలా ఉన్నాయి ?

ప్రయాణ ఛార్జి ఒక్కరికి సూపర్ లగ్జరీ అయితే రూ.2200, అల్ట్రాడీలక్స్ అయితే రూ.2150, ఇంద్ర అయితే రూ.2800 ఉంటుంది. టికెట్స్ కావలసిన వారు ఆన్లైన్‌లో https://www.apsrtconline.inలో విశాఖపట్నం - పంచారామాలు రూట్ సెలెక్ట్ చేసి సీట్స్ రిజర్వ్ చేసుకోవచ్చు.

లంబసింగి టూర్ విషయాలు తెలియజేస్తారా ?

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పిక్నిక్‌లకుగాను లంబసింగినకు ప్రత్యేక బస్సులు నడుపబడుతున్నాయి. అవి శని, ఆదివారాలలో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్సు స్టేషన్ నుండి బయలుదేరుతాయి, లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్ ఫాల్స్, మోదమాంబ గుడి (పాడేరు), కాఫీతోటలు చూపించబడతాయి.

తనిఖీల విషయమేంటి ?

విశాఖపట్నం నుండి బయలుదేరే ఎసి బస్సులు సహా అన్నింటినీ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. ఎసి బస్సుల్లో ఉన్న పరికరాలు, ఫైర్ ఎక్స్టింగ్ మిషన్ హామర్, ఎమర్జెన్సీ డోర్లను పరిశీలిస్తున్నాం. డ్రైవర్లు, కండక్టర్లకు జాగ్రత్తలపై తగు సూచనలు చేస్తున్నాం.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) గాజువాక వారి కోర్టులో
I.P.No. 10/2025

Between:-
చింతా శివ సత్యనారాయణ రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి, 41 సం॥లు, వ్యవసాయం మరియు వ్యాపారం, డోర్ నెం. 8-9, పీటవీధి, అర్తమూరు, మండపేట మండలం, ఆలమూరు JCJC **...పిటీషనర్**

మరియు

1. గుంటిరెడ్డి ధనలక్ష్మి, భర్త శ్రీనివాసరావు, 47సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.31-50-102, ప్లాట్‌నెం.72, డాక్‌యార్డ్ కాలనీ, కాపుజగ్గరాజుపేట, గాజువాక మండలం, గాజువాక JCJC
2. దొప్పలపూడి ప్రసాదరావు, తండ్రి రామారావు, 45సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి, డోర్‌నెం.1-1-70, వివేకానంద కాలనీ, అక్కిరెడ్డిపాలెం, గాజువాక మండలం, గాజువాక JCJC ...**1,2 రెస్పాండెంట్స్**

పై నెంబరు పిటిషన్ దావా గ్రందమునకు సంబందించి 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చెయ్యమని మరియు, 1వరెస్పాండెంట్,2వరెస్పాండెంట్ పేరున ది.13-06-2025న వ్రాయబడి, ది.16-06-2025న దస్తావేజు **నెం.3406/2025**గా SRO గాజువాకలో రిజిష్ట్రీకాబడిన క్రియ దస్తావేజును రద్దు చేయించమని కోరుచూ పిటిషన్ దాఖలు చేసినారు. దీనికి సంబందించి ఎవరికైనా ఏవిదమయిన అభ్యంతరాలు గాని ఆక్షేపణలు గాని, ఉన్న ఎడల **దివి.05-11-2025**న ఉదయం **గం॥10.30ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ సంజాయిషి తెలియజేసుకోవలెను.

వాయిదా తేది.05-11-2025

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

శ్రీ పోతిన రాంబాబు
శ్రీ టి.వి.నారాయణ రెడ్డి
పిటిషనర్ తరపు అడ్వకేట్స్
గాజువాక
సెల్. 9848063581

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 555/2024 I.A. 556/2024
I.A.557/2024 IN O.S. No.163/2015

Between:
గోర్లి బంగారు నాయుడు మరియొకరు **...పిటిషనర్లు/వాదులు**

మరియు
లాలం నాయుడు (died) వగైరాలు **...రెస్పాండెంట్లు/ప్రతివాదు**

నోటీసు

టు
1. **లాలం చిట్టెమ్మ** W/o (లేట్) పైడన్న, సా.భోగాపురం గ్రామం, అచ్చుతాపురం మండలం. అనకాపల్లి జిల్లా.
2. **పైలా దేముడమ్మ** W/o అప్పలనాయుడు D/o (late) లాలం పైడన్న సా.భోగాపురం గ్రామం, అచ్చుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా.
3. **వాలిరెడ్డి శివలక్ష్మి** W/o గంగరాజు D/o (లేట్) లాలం పైడన్న సా.భోగాపురం గ్రామం, అచ్చుతాపురం మండలం. అనకాపల్లి జిల్లా.

పై నెంబరు O.S.163/2025న పిటిషనర్లు/వాదులు పెర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ను జారీ చేయించమని పై నెంబరు రెస్పాండెంట్లు / ప్రతివాదులపై దావా దాఖలు చేయగా సదరు దావాపై కోర్టులో నడుస్తుండగా అందలి 5వ ప్రతివాది అయిన లాలం పైడన్న S/o లేట్ దేముళ్ళు కాలం చేసి ఉన్నారు. పై నోటీసులో తెలియజేసిన PROPOSED రెస్పాండెంట్లు / ప్రతివాదులు 14 to 16 లాలం పైడన్న గారి వారసులై యున్నారు. సదరు దావా **తేది.10-11-2025న** వాయిదా అయి వున్నది. కావున ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **తేది.10-11-2025న ఉదయం గం.10-30 ని.లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపున న్యాయవాది గారి ద్వారా గానీ హాజరు అయి మీకు గల అభ్యాస్తరములు ఆక్షేపణలు తెలియజేయ వలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ వరోక్షమున పై దావాను తీర్మానించగలరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
తట్టా పెంటయ్య, జే.సి.రామకృష్ణ,
న్యాయవాదులు, యలమంచిలి.
సెల్ : 9912439360
మకాం: యలమంచిలి,
తేది.02-11-2025.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ బట్టి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 271/2024 I.A. 272/2024
L.A. 273/2024 IN O.S. No.163/2015

Between;
గోర్లి బంగారు నాయుడు మరియొకరు **...పిటిషనర్లు/వాదులు**

మరియు
లాలం నాయుడు (died) వగైరాలు **...రెస్పాండెంట్లు/ప్రతివాదుల**

నోటీసు

టు
1. **లాలం దేముదమ్మ** భర్త (లేట్) నాయుడు సా. భోగాపురం గ్రామం, అచ్చుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా.
2. **లాలం అప్పారావు** S/o (లేట్) నాయుడు సా. భోగాపురం గ్రామం, అచ్చుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా.
3. **సిరపు సంజీవి** W/o అప్పలనాయుడు D/o (లేట్) లాలం నాయుడు సా.తాల్లదిబ్బ గ్రామం, అచ్చుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు O.S. 163/2025న పిటిషనర్లు/వాదులు పెర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ను జారీ చేయించమని పై నెంబరు రెస్పాండెంట్లు / ప్రతివాదులపై దావా దాఖలు చేయగా సదరు దావాపై కోర్టులో నడుస్తుండగా అందలి 1వ ప్రతివాది అయిన లాలం నాయుడు S/o లేట్ దేముళ్ళు కాలం చేసి ఉన్నారు. పై నోటీసులో తెలియజేసిన PROPOSED రెస్పాండెంట్లు / ప్రతివాదులు 10 to 13 లాలం నాయుడు గారి వారసులై యున్నారు. సబ్దరు దావా **తేది.10-11-2025న వాయిదా** అయి వున్నది. కావున ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **తేది.10-11-2025న ఉదయం గం.10-30 ని.లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గని, మీ తరపున న్యాయవాది గారి ద్వారా గానీ హాజరు అయి మీకు గల అబ్యాన్తరములు ఆక్షేపణలు తెలియజేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ వరోక్షమున పై దావాను తీర్మానించగలరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
తట్టా పెంటయ్య, జే.సి. రామకఅష్ణ,
న్యాయవాదులు, యలమంచిలి.
సెల్ : 9912439360
మకాం: యలమంచిలి,
తేది.02-11-2025.

3 నెలలుగా ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్‌తోనే...

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు చేపలుప్పాడ కేంద్రంగా 6 వార్డుల సచివాలయాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆగస్టు నుంచి వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారి హరిప్రియ రెగ్యులర్ పోస్టులో పాడేరు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి భీమిలిలో పట్టణ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి ఈ కేంద్రంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రోజుకు 60 నుంచి 70 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇక్కడ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ (ఎల్‌జిఎస్) ఒక్కొక్కరు ఉన్నారు. రోజు వారీ వచ్చే అవుట్ పేషెంట్లలో కొంత మంది గర్భిణులు కూడా ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలు, ఇతరత్రా సేవలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సల కోసం భీమిలిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి, కొన్ని సందర్భాల్లో కెజిహెచ్‌కు రిఫర్ చేస్తుంటారు. ఇక్కడి ల్యాబ్‌లో రక్త, సుగర్ తదితర 63 రకాల పరీక్షలు చేస్తున్నారు. విశాలమైన, సౌకర్యాలతో కూడిన 10 గదులు, వైద్యులు, సిబ్బంది, రోగులకు మరుగు దొడ్లు, టాయిలెట్లు ఉన్నాయి. తాగు నీటి సదుపాయం ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నా సరే, వైద్యాధికారి పోస్టు భర్తీ కాకపోవడంతో కొన్ని సందర్భాల్లో రోగులు అత్యవసర సేవలు పొందలేని పరిస్థితి ఉంది. దీంతో ఉన్న ఇద్దరు స్టాఫ్ నర్సులు అదనపు బాధ్యతలతో, పని ఒత్తిడితో సతమతమౌతున్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న వైద్యాధికారి పోస్టును సత్వరమే భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.


చేపలుప్పాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

365 మట్టి శివలింగాలకు రుద్రాభిషేకం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో ఆదివారం 365 మట్టి శివలింగాలకు రుద్రాభిషేకాన్ని గ్రామానికి చెందిన బుగత శ్రీను ఆధ్వర్యాన నిర్వహించారు. శివాలయం ప్రాంగణంలో హోమం ఏర్పాటు చేశారు.

షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న షిరిడి సాయి ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవాన్ని ధర్మకర్త మురళి ఆధ్వర్యంల ఆదివారం నిర్వహించారు. అనంతరం 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అనంతుని మెట్ల మార్గంలో గ్రిల్స్

ప్రజాశక్తి- పద్మనాభం : శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవస్థానం కొండపైకి మెట్లు మార్గంలో మెట్లకు ఇరువైపులా వికలాంగులు, వృద్ధులకు సపోర్టుగా ఉండేందుకు ఐరన్ గ్రిల్స్‌ను రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి జగదీష్ తన సొంత నిధులు రూ.1.20 లక్షలతో ఏర్పాటుచేశారు. జగదీష్‌కు ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలిపింది.

సిసి రోడ్డుపై వివాదం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలోని వేములవలస ఎస్‌సి, బిసి కాలనీలో ఇటీవల పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారి స్థానికుల మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండాల్సిన ఈ రహదారిపై కొంతమంది అడ్డంకులు సృష్టిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్మించిన ఈ రహదారిపై మీరు నడవకూడదని కొందరు హుకుం జారీ చేయడంపై మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రహదారిపై ఇలాంటి ఆంక్షలు విధించడం బాధాకరమని, పంచాయతీ నిధులతో నిర్మించిన రహదారిని ఎవరి వ్యక్తిగత ఆస్తిగా భావించడం సరికాదని ఒక వర్గం పేర్కొంటుంది. ఈ సమస్యపై అనేకమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాము త్వరలో అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు.


వివాదమైన సిసి రోడ్డు ఇదే...

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ...

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యాన 13వ వార్డు పరిధి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో వార్డు వైసిపి అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యాన ఆదివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గురజాడ రాము, శెట్టి కామేష్, కాకర గోవిందు, వంకర బాబూరావు, పండంటి శ్రీను, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు తదితరులు

సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి గురుద్వార్ జంక్షన్‌లో మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మువ్వల సంతోష్, బోగవల్లి గోవింద్, సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, నూకరాజు, గుదే రాజు, శ్రవణ్, అశోక్, అప్పలరాజు, సూరిబాబు, బొమ్మాలి రవి, గణేష్, వీరమ్మ, ఉమా, పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలోని సొంట్యాం గ్రామపంచాయతీ పరిధిలో వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సుమారు వెయ్యి మంది ప్రజలు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, నాయకులు మజ్జి సిరమ్మ, మజ్జి వెంకట్రావు, లంక లావణ్య, పాండ్రంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజా ఉద్యమాలతో అడ్డుకుంటామని వైసిపి దక్షిణ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగదాంబ జంక్షన్‌లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జరిగితే నేటి తరాల భవిష్యత్తు శూన్యమవుతుందన్నారు. పార్టీ 29వ వార్డు అధ్యక్షులు పీతల వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేట్ యూత్ సెక్రెటరీ కనకల ఈశ్వర్, జిల్లా బిసి విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాలు


రేషన్ సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : మొంథా తుపాన్ కారణంగా వేటకు వెళ్లని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన పంపిణీచేశారు. వార్డులోని సుమారు 20 మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు కేజీ చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి కార్యదర్శి యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, జనసేన నాయకులు నీలి పైడిరాజు, అడ్డూరి రమణ, మారిక జక్కన్న, మాసాబత్తుల శ్రీనివాసరావు, గుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: తుపాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు వంట నూనె, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాండ్రాశి అప్పలరాజు, సత్యనారాయణ, ఈగల రవికుమార్, కొండపు రాజు, శ్రావణ్, సరస్వతి, అన్నపూర్ణ నూకరాజు, రవి, శ్రీను, రమణమూర్తి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యాభర్తలు ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెంలో భార్యాభర్తలు అనిత, వాసు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. అనిత 7 నెలల గర్భవతిగా ఉంది. వారిద్దరూ ఆత్మహత్యకు పాల్పడినప్పుడు వాసు తల్లి ఒకరే ఇంట్లో ఉన్నారు. వాసు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దర్యాప్తు చేపట్టారు. అనిత గర్భవతి కావడంతో పసిబిడ్డను కాపాడేందుకు పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. బిడ్డ అయినా బతుకుతుందేమోనని పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కోతి విహారంతో భయాందోళన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి రాజచెరువు వద్ద ఆదివారం సాయంత్రం ఇద్దరు పిల్లలపై కోతి దాడిచేయడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాజచెరువు వద్ద ఉంటున్న దేవుడు ఇంట్లో కుక్కలు, కోతులు పెంచుతున్నాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు ఆదివారం రాత్రి వచ్చి విచారణ చేపట్టారు. దీనిపై దేవుడు మాట్లాడుతూ, ఈ కోతులు ఎక్కడినుంచి వచ్చాయో తనకు తెలియదని, వాటిపై తాను సచివాలయ సిబ్బందికి తెలియజేశానని చెప్పారు. ఎవరూ పట్టించుకోకుండా తనపై నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

జోగి రమేష్ అరెస్ట్ హేయం

ప్రజాశక్తి -తగరపువలస : మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టును వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి ఖండించారు. నకిలీ మద్యంతో ఎలాంటి సంబంధం లేని మాజీ మంత్రి జోగి రమేష్‌ను అరెస్ట్ చేయడం అన్యాయం అని పేర్కొన్నారు. నకిలీ మద్యం తయారీ ఫ్యాక్టరీలు బయట పడింది చంద్రబాబు హయాంలోనే అని, ఆ ఫ్యాక్టరీలను నడిపించేది టిడిపి వారేనని, తయారు చేసింది చంద్రబాబు మనుషులే అని ఆరోపించారు. దీనిపై తక్షణమే సిబిఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తునిపాలెంలో సమస్యల కొలువు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామ పంచాయతీ పరిధి తునిపాలెం గ్రామం సమస్యలకు నిలయంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు మహిళలు చెబుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, నీరు బురదగా వస్తుందని, రహదారులు సరిగా లేవని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని గ్రామ పెద్దలను మహిళలు కోరారు. ఇటీవల గెడ్డ వాగులో కొట్టుకుపోయి మృతి చెందినకాళ్ల ధనుశ్రీ కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరామర్శించడానికి గ్రామానికి వచ్చారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సహాయం కింద రూ.4 లక్షల అందించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకెళ్లడాని ఇది సమయం కాదని గ్రామ పెద్దలు చెప్పడంతో మహిళలు నిరాశ చెందారు.


బురదమయంగా వస్తున్న తాగునీరు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 2వ వార్డు పరిధి నమ్మివానిపేటలో సిసి.రోడ్డు, కాలువ పనులను కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు చిన్నికుమారిలక్ష్మి సూచించారు. గ్రామస్తులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, చిల్ల గురుమూర్తి, త్రినాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి

నాడు శిథిలం.. నేడు సుందరం...

ప్రజాశక్తి- వేపగుంట : ఎన్నో ఏళ్ల కల సోమవారం ఫలిస్తుందని జివిఎంసి 93వ వార్డు పరిధి కృష్ణానగర్ వాసులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కృష్ణానగర్‌లో సుమారు 20 ఏళ్ల కిందట సామాజిక భవనం నిర్మించారు. ఆ భవనంలో ప్రభుత్వ హోమియో ఆసుపత్రిని నడిపారు. వైద్యులు సేవలు అందించడంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. తదనంతర కాలంలో ఈ భవనం ఎటువంటి మరమత్తులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పలుమార్లు హోమియో ఆస్పత్రిని సందర్శించి నూతన భవన నిర్మాణానికి హామీ ఇచ్చారు. కానీ హామీ నెరవేర్చలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక జనసేన నాయకుడు ఎర్ర నాగరాజు, స్థానికులు కలిసి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి ఈ భవనం విషయం తీసుకెళ్లారు. 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నకు సమస్యను వివరించారు. జివిఎంసి నిధులు సుమారు రూ.35 లక్షలతో గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రాపర్తి కన్న భవన నిర్మాణంపై దృష్టి సారించి, పనులు వేగవంతం చేయించారు. దీంతో భవన నిర్మాణం పూర్తయింది. ఈ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. భవన నిర్మాణం పూర్తికావడంతో ఎమ్మెల్యే రమేష్‌బాబుకు కార్పొరేటర్ కన్నాకు ఆసుపత్రికి వచ్చే రోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


పాత భవనం


నిర్మాణం పూర్తిచేసుకున్న కొత్త భవనం

అదాని సిమెంట్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దుచేయాలని కోరుతూ వార్యా, నివాస్ ఆధ్వర్యంలో జివిఎంసి 70వ వార్డు పరిధి తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ మహిళలు కూడా కరపత్రాలు, ఫ్లకార్డులు పట్టుకొని 'ఈ ఫ్యాక్టరీ మాకొద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ, జనవాసాల మధ్య ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే, ప్రజల అనారోగ్యాలకు గురవుతారన్నారు. వార్యా, నివాస్ అధ్యక్షులు బి.వి.త్రినాధస్వామి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోక్యం చేసుకొని, అనుమతులు రద్దయ్యేలా కృషిచేయాలని కోరారు. అనంతరం 70వ వార్డు పరిధిలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసోసియేషన్ మహిళా కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫ్లకార్డులు, కరపత్రాలు పట్టుకొని నిరసన తెలుపుతున్న మహిళలు

జీవన్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- గాజువాక : పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన అగనంపూడి నివాసి ఎ.జీవన్‌కుమార్‌ను ఫిట్‌నెస్ క్లబ్ కోచ్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన జూనియర్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, వ్యక్తిగత నైపుణ్యంతో క్రీడారంగంలో అవార్డులు సాధించుకోవచ్చని తెలిపారు. శరీర దృఢత్వానికి, చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు క్రీడలు దోహదపడతాయన్నారు. 85వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి విందుల రాజు మాట్లాడుతూ, మన పిల్లలు మంచి ఫలితాలను సాధించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సభ్యులు డొక్కా రమేష్, స్థానిక టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు విద్యార్థులు చరణ్‌సాయి, తరుణ్, జీస్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ తొక్కిసలాటపై దుష్ప్రచారం తగదు : టిడిపి

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై దుష్ప్రచారం చేయడం వైసిపి నీచ, శవ రాజకీయాలకు నిదర్శనమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘటన జరిగిన మరుక్షణమే ప్రభుత్వ అప్రమత్తమైందన్నారు. స్థానికంగా ఉన్న నాయకులు, ఎమ్మెల్యేలు మంత్రులు, సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించడాన్ని గుర్తుచేశారు. మంత్రి నారా లోకేష్ తోపాటు తాను కూడా సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి, మృతుల కుటుంబాలకు ఓదార్చి ధైర్యం చెప్పినట్లు వివరించారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు పరిహారం ప్రకటించినట్లు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో లేదని, ఇది పూర్తిగా ఒక ప్రైవేట్ వ్యక్తి ఆధీనంలో నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇటువంటి ప్రమాదాలపై వైసిపి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ఇటువంటి ప్రమాదాల సమయంలో సహాయ సహకారాలు అందించాలి తప్ప దుష్ప్రచారం చేయడం తగదని వైసిపి నేతలకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీను, బొండా జగన్, రౌతు శ్రీను, కేబుల్ మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: మొంథా తుపాన్ చంద్రబాబు సృష్టించిన విపత్తు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వ్యాఖ్యలు చేయడం అతని మానసిక స్థితి బాగోలేనట్లు స్పష్టం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు ఎద్దేవా చేశారు. తుపాన్ తర్వాత వైసిపి నేతలు, సలహాదారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో తుపాన్ నష్టాలపై చిలువలు, పలవలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అంటగట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఘటన జరిగినాదాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ, ప్రాంతీయ, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా జగన్ అండ్ కో వ్యవహరించడాన్ని చూసి సొంత పార్టీ నాయకులే విస్తుపోయారన్నారు. మొంథా విలయంలో రాష్ట్రంలో ఐదువేల కోట్లపైబడి నష్టం వాటిల్లిలో బాధితుల మధ్యకు రావడానికి మనసొప్పని జగన్, బెంగళూరు నుంచే ప్రెస్‌మీట్లు పెట్టి బురద చల్లాలనుకోవడం హేయమన్నారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనను కూడా రాజకీయం చేస్తూ ప్రభుత్వ హత్యలంటూ వైసిపి నేతలు ఊదరగొట్టే ప్రచారం చేస్తూ శవ రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

యలమంచిలి టౌన్ :శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు ప్రగాడ నాగేశ్వరరావు అన్నారు..ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, అవసరమైన సహాయకచర్యలు చేపట్టిందన్నారు. తొక్కిసలాటలో భక్తులు చనిపోగానే వైసిపి శవరాజకీయాలు మొదలు పెట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి పప్పల చలపతిరావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, రాజాన సూర్య నాగేశ్వరరావు, బొద్దపు శ్రీనివాసరావు, కౌన్సిలర్ రామకృష్ణ, గొర్లె బాబూరావు, సేనాపతి తులసీరామ్, భీమిని సత్యనారాయణ, రాజా మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అప్పన్న నిత్యాన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామి నిత్యాన్న ప్రసాదానికి సింహాచలం రాజీవ్ కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి రూ.1,00,116 విరాళం అందించారు. దేవస్థానం విరాళ కౌంటర్‌లో నగదు చెల్లించి, రసీదును పొందారు. ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి సునీల్‌కుమార్ దేవస్థానం తరపున నిత్యాన్నప్రసాద పథకం బాండ్‌ను అందజేశారు. దాతకు దర్శనం కల్పించి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి ప్రసాదాలను భక్తునికి అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న డిజిపి దంపతులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)హరీష్ కుమార్ గుప్తా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. హరీష్ కుమార్ గుప్తా దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రధాన ఆలయంలో స్వామివారి మూలవిరాట్ సన్నిధిలో ఆలయ అర్చకులు డిజిపి దంపతుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిజిపి దంపతులను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎడిసిపి కింజరాపు ప్రభాకర్, ఎసిపి పృథ్వీరాజ్, గోపాలపట్నం సిఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.


బుద్ధప్రసాద్ ద్వారా పురస్కారం అందుకుంటున్న చలపతిరావు

చలపతికి చింతా నారప్ప స్మృతి పురస్కారం

ప్రజాశక్తి -ములగాడ : విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగిన ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ మన సంస్కృతి చిత్ర కళా ప్రదర్శన కార్యక్రమంలో కళా రత్నశ్రీ సుంకర చలపతిరావుకు కీర్తిశేషులు చింతా నారప్ప స్మృతి పురస్కారాన్ని మాజీ మంత్రి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గిల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.ఎ.రెడ్డి, కార్యదర్శి ఎన్‌విపిఎస్‌ఎస్.లక్ష్మి, కన్వీనర్ పి.రమేష్, కోశాధికారి ఆర్.సుభాష్‌బాబు, చిత్రకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

యువ దర్శకుడు రామ్‌జగదీష్‌తో 7న ముఖాముఖి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇటీవల తక్కువ బడ్జెట్‌తో సామాజిక బాధ్యతతో రూపొందించి మంచి విజయాన్ని సొంతం చేసుకున్న కోర్టు తెలుగు సినిమా యువ దర్శకుడు విశాఖ వాసి రాంజగదీష్‌తో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 7వ తేదీన ముఖాముఖి నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పౌర గ్రంథాలయంలో ఆదివారం నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, డాక్టర్ బాబ్జి, ప్రభు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


ఆటలు ఆడుతున్న సమైక్య అపార్ట్‌మెంట్ పిల్లలు

పిల్లలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి -గాజువాక : చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఆదివారం పిల్లలు ఆటల పోటీలు నిర్వహించారు. విసిసి ఆధ్వర్యాన చేపట్టిన ఈ పోటీల్లో మ్యూజికల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, అప్.. డౌన్ తదితర ఆటలు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపికచేశారు. వీరికి చిల్డ్రన్స్ డే సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు.

రోడ్డు విస్తరణ సమస్యలు పరిష్కరించాలి

• సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకరరావు


మాట్లాడుతున్న సిపిఎం నేత శంకరరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రోడ్డు విస్తరణ పనులతో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించి పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకరరావు సూచించారు. ఆదివారం, అచ్యుతాపురంలో సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అచ్యుతాపురం మండల కేంద్రంలో రోడ్డు పనులు వలన నిత్యం ట్రాఫిక్ సమస్యతో కార్మికులు ఉద్యోగులు విద్యార్థులు మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. తుఫాన్ కారణంగా మండలంలో వెదురువాడ ఎస్ఇజెడ్ కాలనీలలో భారీ వాహనాలు వెళ్ళటం వలన రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని, వెంటనే వాటిని పునర్నిర్మించాలని కోరారు. అప్పన్నపాలెం నుండి బంగారయ్యపాలెం మీదుగా చీమలపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. పూడిమడక గ్రామంలో తుఫాన్ బాధితులందరికీ బియ్యం నిత్యవసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కారణంగా గుంటల్లో నీరు నిల్వ పేరుకుపోయి దోమలు విజృంభించి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగు చర్యలు చేపట్టాలన్నారు. మంచినీళ్ల ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని అలాగే వీధులలో బ్లీచింగ్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము పూడిమడక గ్రామ కార్యదర్శి చేపల తాతయ్య, తిమ్మరాజుపేట పార్టీ నాయకులు కార్యకర్తలు ఎస్ రామానాయుడు, హరిపాలెం గ్రామ కార్యదర్శి బి రామ్‌కుమార్, అచ్యుతాపురం పార్టీ కార్యదర్శి కె సోము నాయుడు, సీనియర్ నాయకులు బుద్ధ రంగారావు, ఆర్ లక్ష్మి పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు


ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీకమాసం సందర్భంగా సముద్ర తీరప్రాంతాలు, నదులు, శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా అవసరమైన పటిష్టభద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశించారు. భక్తులు సురక్షితంగా, ప్రశాంతంగా కార్తీక పూజలు ఆచరించేందుకు జిల్లా పోలీసు శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందన్నారు కార్తీక మాసంలో సోమవారాలు, ముఖ్య పర్వదినాల్లో శివాలయాల వద్ద భారీగా భక్తులు వస్తారని దృష్టిలో ఉంచుకుని ప్రధాన శివాలయాల వద్ద అదనపు సిబ్బంది నియమించారన్నారు. సిసి కెమెరాల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ పర్యవేక్షణ, పిక్నిక్, వనభోజన ప్రాంతాల్లో యువత మధ్య గొడవలు, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలను పాటిస్తూ ప్రజలంతా సహకరించాలని ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో అపారిశుధ్యం, మంచినీరు తదితర సమస్యలు ఉత్పన్నమైన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బందిగా తమ సేవలు అత్యవసరమని భావించి ఈనెల మూడో తేదీన తలపెట్టిన మున్సిపల్ కార్మికుల రాష్ట్ర సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాస్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం సమ్మె వాయిదా దృష్టిలో ఉంచుకొని తక్షణమే మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై నూకరాజు, సిహెచ్ వెంకటరమణ, డి మహేష్,జె వెంకటరమణ, ఎం నాగరాజు పాల్గొన్నారు

కార్యకర్తల కుటుంబానికి అండ


ప్రమాదబీమా చెక్ అందజేస్తున్న,రాంకీ

ప్రజాశక్తి-అనకాపల్లి :పార్టీ ఆవిర్భావం నుంచి కష్టాల్లో ఉన్న కార్మికుల కుటుంబాలకు జనసేన అండగా ఉంటుందని అనకాపల్లి నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ అన్నారు. ఆదివారంకోడూరు, భూపతిపాలెం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన క్రియాశీల కార్యకర్త రాకోటి అర్జున్‌రావు కుటుంబానికి జనసేన పార్టీ ప్రమాద బీమా పరిహారం కింద రూ. 5లక్షల చెక్కును అందజేసారు కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఉత్తమ సేవా పురస్కారం


చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరిస్తున్న మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మొంథా తుఫాను సమయంలో మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన తహశీల్దారు ఎస్ఎ మహేశ్వరరావును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తమ సేవా పురస్కారం అందజేసి అభినందించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో తహశీల్దారుకు ప్రశంసాపత్రం అందజేశారు.ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న తహశీల్దారు మహేశ్వరరావును హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, రెవెన్యూ అధికారులు, పాయకరావుపేట టిడిపి మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

వడ్డాదికి ప్రముఖులు తాకిడి


నవ దంపతులతో హోంమంత్రి అనిత, ఇతర నేతలు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామానికి ఆదివారం ప్రముఖుల తాకిడి పెరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కుమారుడు వంశీ, పూజిత దంపతుల వివాహ రిసెప్షన్‌ను స్థానిక తిరుమల కన్వెన్షన్లో నిర్వహించారు. ఈ రిసెప్షన్ వేడుకకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ హోంమంత్రి, ప్రస్తుత పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, అవంతి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద, స్టేట్ కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు వివిధ ప్రాంతాల నుండి ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు అధికారులు తరలివచ్చారు. ప్రముఖుల రాకతో వడ్డాది సందడిగా మారింది. ట్రాఫిక్ నియంత్రణ, విఐపిల భద్రతకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను కూడా వినియోగించుకోవచ్చని గుర్తుచేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లో పిజిఆర్ఎస్ అర్జీలు

అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్ ద్వారా నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు Meekosam. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, ఇతర పూర్తి సమాచారాన్ని డయల్1100కు ఫోను చేసి, నేరుగా తెలుసుకోవచ్చన్నారు.

ఉల్లాసంగా హ్యాపీ సండే


బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి, యలమంచిలి టౌన్ : ప్రతి ఆదివారం నిర్వహించే హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఈ ఆదివారం కాకివాని వీధి, సైతారు పేట మార్గంలోని ఎస్‌సి కాలనీ సచివాలయాల పరిధిలోని రామాలయంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొని పిల్లల్ని సంతోషంగా ఉంచడానికి , వారి భవిష్యత్తు ఆనందమయంగా గడపడానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. డాన్స్, ఆటలు కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుప్తాగారు,కౌన్సిలర్లు ఒగిబోయిన చిరంజీవి, కట్టాముదు సుజాత, కమిషనర్ ప్రసాద్ రాజు,బిశెట్టి చిన్నారావు, కోన హరి, సచివాలయాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - యలమంచిలి : మెయిన్ రోడ్డును ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్న వారిపై ఆదివారం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను దాటుకొని ముందుకొచ్చిన వ్యాపారులను అదుపు చేశారు. వారిని వెనక్కి వెళ్లాల్సిందిగా కోరారు. మొరాయించిన వారిని బలవంతంగా నెట్టివేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు పార్కింగ్‌కు స్థలం లేకుండా ఆక్రమించిన వ్యాపారులను ఖాళీ చేయించారు. అదే సమయంలో డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వెళ్లే ద్విచక్ర వాహన దారుల్ని ఆపి లైసెన్సులు తనిఖీ చేశారు. మైనర్లు నడుపుతున్న బైక్‌లను ఆపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇప్పించారు. మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు .

విధి నిర్వహణలో ప్రాణ సాహసం

• ఉధృతంగా ఉన్న నదిని దాటి వెళ్లి సేవలు


• చింతలపూడి సచివాలయ ఉద్యోగుల

చొరవకు పలువురి అభినందన


శారదానది నీటిలో దిగి వెళుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : విధి నిర్వహణే పరమావధిగా భావించే ఉద్యోగులున్నారనే దానికి నిలువెత్తు నిదర్శనమే ఈ ఘటన . అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి సచివాలయ మత్స్యశాఖ ఉద్యోగి ఎండి రజాక్, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.కె.గౌతమి ప్రాణాలకు తెగించి పెద్ద సాహసమే చేశారు. తమ సచివాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో నేరళ్లపూడి, బోడి గరువు, మదనగరువు, బొడ్డగుడ తదితర గిరిజన తండాలున్నాయి. అక్కడ 50 కుటుంబాలు నివాసముంటుండగా, 26 మంది పింఛనుదారులున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజనతండాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి సేవలు అందించేందుకు గౌతమి బయలు దేరగా, ఆయా గ్రామాల్లోని పింఛనుదారులకు పెన్షన్ అందించేందుకు రజాక్ వెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాలకు చేపట్టిన రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోగా,. ఇటీవల తుఫాను భారీ వర్షాలతో శారదానదిలో వరదనీరు పోటెత్తింది వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ఉధృతి కాస్తా తగ్గినా, ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ బాధ్యతను చేపట్టేందుకు మత్స్యశాఖ ఉద్యోగి ఎండి. రజాక్, గిరిజనులకు వైద్య సేవలందించడానికి .గౌతమి బయలుదేరారు. కొంతదూరం కాలినడకన వెళ్లిన వారు తర్వాత ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానదిని ప్రాణాలకు తెగించి దాటి వెళ్లారు. రజాక్ పింఛన్లు పంపిణీ చెయ్యగా, గౌతమి గిరిజనులకు వైద్యం చేశారు. మరల ఇద్దరు కలిసి అతి కష్టం మీద సచివాలయానికి చేరుకున్నారు. విధి నిర్వహణలో ఇద్దరు ఉద్యోగులు చేసిన సాహసాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రెండు తలలతో ఆవు దూడ జననం


రెండు తలల ఆవు దూడ

ప్రజాశక్తి -చోడవరం : మండలంలోని జుత్తాడ గ్రామంలో రెండు తలలతో దూడకు ఆవు జన్మనిచ్చింది. గ్రామంలో మల్ల శ్రీను అనే రైతు ఆవులను పెంచు తున్నారు. వాటిలో ఒక ఆవు శనివారం ఉదయం రెండు తలలతో కూడిన దూడకు జన్మ నిచ్చింది. దూడ ఆరోగ్యంగానే ఉందని, పాలు కూడా రెండు తలలతో తాగుతుందని యాజమాని శ్రీను తెలిపారు. వింతదూడను చూడడానికి ప్రజలు తరలి వస్తున్నారు.

మురుగు మధ్య మంచినీటి కుళాయి

అవస్థలు పడుతున్న గొల్లవీధి వాసులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కుళాయి చుట్టూ పేరుకుపోయిన మురుగు

ప్రజాశక్తి ఎస్ రాయవరం.:మండల కేంద్రమైన రాయవరం గొల్లవీధిలోని కుళాయి మురుగునీటిలో ఉందంటూ గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గొల్లవీధిలో కొన్ని ఇళ్లలో వాడుక నీరు రోడ్డు ప్రక్కన ఉన్న ఈ కుళాయి వద్దకు చేరి నిల్వ ఉంటోందని, ఆ మురుగు నీటిని తొక్కుకుంటూనే వీధివాసులు కుళాయి వద్ద తాగునీరు పట్టుకోఆవల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శికి, ఇఒపిఆర్‌డికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆరునెలలుగా మురుగు నీటిలో మంచినీరు పట్టుకునే దుస్థితిలో ప్రజలు అనారోగ్యం పాలౌతున్నా అధికారుల్లో కదలిక లేదన్నారు .తక్షణం స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

నష్ట నివారణ చర్యలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పరవాడ: పెందుర్తి నియోజకవర్గంలో మొంథా తుఫాన్ నష్టాలను తగ్గించేందుకు నిరంతరం శ్రమించిన అధికార యంత్రాంగం, కూటమి నాయకులు, స్వచ్ఛంద సేవకులు, తదితరులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అభినందనలు తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజల భద్రతకు రేయింబళ్లు శ్రమించిన అధికారుల కర్తవ్య నిష్ట ప్రశంసనీయమని కొనియాడారు. బాధితులకు సకాలంలో సహాయ చర్యలు చేపట్టడంలో ప్రతి ఒక్కరూ విశేషంగా కృషి చేశారన్నారు. తుఫాన్ తర్వాత పునరావాసం, నిత్యావసరాల పంపిణీ, విద్యుత్ పునరుద్ధరణ, రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వైస్ ఎంపిపి పుట్టినరోజు వేడుక



వైస్ ఎంపిపి జ్యోతికి కేకు తినిపిస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండల వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీను పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు, అభిమానులు కేక్ కట్ చేసి పంచారు, పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల కేంద్రంలోని అయ్యన్న జూనియర్ .డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం క్యాడెట్ల ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజు ఆదివారం జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లోక్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్. ప్రోగ్రాం అధికార్లు గాడి అప్పారావు, సీముసురు రమణ ఆధ్వర్యంలో రెండు కళాశాలల.వాలంటీర్లు పర్యావరణ పరిరక్షణలో భాగంగా రక్షిత నీటి పథకాలు, ఆరోగ్య కేంద్రం, రహదార్లు తదితర ప్రాంతాలలో తుప్పలను, ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను తొలగించారు.కార్యక్రమంలలో జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకులు సుశీల, దుర్గాదేవి, కల్యాణి, దీప్తి పాల్గొన్నారు.



పరిశుభ్రతా పనుల్లో ఎన్‌సిసి క్యాడెట్లు

ముఖ్యమంత్రి దృష్టికి ముంపు సమస్యలు



గెడ్డను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం నియోజకవర్గంలోని రహదారులు, ఇతర ముంపు సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, చర్చించడం ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న మండలంలో రాయపురాజుపేట ఎర్రిగెడ్డ వంతెనను పరిశీలించారు. వంతెన లేకపోవడంతో పది గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు మంత్రికి వివరించారు. అనంతరం ఇటీవల తుఫాన్ కురిసిన వర్షాలకు గవరవరం, భోగాపురం శారదా నదికి పడ్డ గండ్లను పరిశీలించారు గ్రామంలో భూలోకమాంబ పండగ సందర్భంగా ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేటి నాగగంగాధర్, మండల టిడిపి అధ్యక్షులు కనిశెట్టి సన్యాసిరావు, స్థానిక సర్పంచ్ బుడ్డేడ రామనాయుడు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సస్యరక్షణపై సూచనలు



బంతిపూల తోటలో సూచనలు చేస్తున్న కిరణ్మయి

ప్రజాశక్తి-సబ్బవరం : మొంథా తుపాన్ ప్రభావంతో గాలులు, వర్షాలకు నష్టం వాటిల్లిన కూరగాయల పంట సస్యరక్షణకు స్థానిక ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి సూచనలు చేశారు పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత వరకు త్వరగా బయటకు పంపేయాలని, అవసరమైతే పొలంలో కాలువలు ఏర్పాటు చేయాలన్నారు వర్షాలు ఆగిన వెంటనే 19:19 :19 లేదా 13 :0 :45 లేదా యూరియా వంటి పోషకాలు పిచికారి చేయాలన్నారు. కూరగాయల పంటలో పెరిగిన కలుపు మొక్కలు తొలగించాలన్నారు. ముంపుబారిన పడిన కూరగాయల పంటకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా లేదా మెటాలాక్సిల్, మాంకోజెబ్ రెండు గ్రాములు మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు అలాగే ఆకుమచ్చ కాన్పారా వంటి తెగుళ్ళు ఆశించే అవకాశమున్నందున కాపర్ అక్సీ క్లోరైడ్, స్ట్రెప్టో సైక్లిన్ కలిపిన మందుద్రావణం ద్రావణం పిచికారి చేయాలన్నారు. . ఆకుమచ్చ బూజు తెగులు ఆశించకుండా కార్బండైజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ రెండు గ్రాములు ఒలీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈసందర్భంగా మల్లు నాయుడు పాలెంలో బంతి పూల తోట సాగును పరిశీలించారు.

పేదల ఆరోగ్యానికి పెద్ద పీట



చెక్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

ప్రజాశక్తి-కశింకోట : పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనిమాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కశింకోట, బయ్యవరం, జమ్మాదుల పాలెం, సుందరయ్య పేట, కన్నూరు పాలెం, తీడ, ఏనుగుతుని గ్రామాలలో 14 మందికి రూ.7.52 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి ఉందన్నారు కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, మజ్జి నిరంజన్‌కుమార్, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కలగ సోమేశ్వరరావు, సిదిరెడ్డి సూర్య నారాయణ, కిల్లాడ నానిబాబు,తాకాశి కృష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామంలో చింతాలమ్మ ఆలయం వద్ద కార్తీక మాసం వనభోజనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. దొగ్గవారి కల్లాలు, కిల్లి వారి మోద దగ్గర ఏర్పాటు చేసిన వనభోజనాల్లో గ్రామ చుట్టుపక్కల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు కార్యక్రమంలో గ్రామ పెద్ద ఆవుగడ్డ రామ్మూర్తినాయుడు, సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపిటిసి అవుగడ్డ రమాదేవి, బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు ఆవుగడ్డ సత్యవేణి నాయుడు అమ్మ, అవుగడ్డ కోటిపల్లి నాయుడు, కిల్లి గోవింద, దోగ్గ రామకృష్ణ, కిల్లి రామ్మూర్తి, దోగ్గ శ్రీను, కిల్లి అబద్ధం పాల్గొన్నారు.

అయ్యప్పదీక్షాపరులకు అన్నసమారాధన

ప్రజాశక్తి, యలమంచిలి టౌన్ :మండలంలోని పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామంలో ఊటకూటి శేఖర్ స్వామి ఇంటివద్ద అయ్యప్పస్వామి పీఠంలో శేఖర్ స్వామి ఆధ్వర్యంలో నిత్యం అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. 41రోజులపాటు నిరంతరాయంగా అయ్యప్పదీక్షా పరులకు భిక్ష, అల్పాహారం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలకోరారు. నిర్వాహకులను అయ్యప్ప క్షాపరులు అభినందిస్తూ, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శేఖర్‌కు పలువురి పరామర్శ



శేఖర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల.

ప్రజాశక్తి. -సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ సాయినగర్ కాలనీకి చెందిన జనసేన సీనియర్ నాయకులు తాటిపాముల శేఖర్‌ను ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఇతర నేతలు పరామర్శించిరు. శేఖర్ తండ్రి ఇటీవల మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకట రమణ, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు, రోమాల చంద్రశేఖర్, సర్పంచులు బొకం స్వామినాయుడు, కర్రి నరసింగరావు, దొడ్డి సూర్య ప్రకాష్, వాయుపుత్ర రాము, బంతికోళ్ల పద్మ, కిల్లి వెంకట సత్యనారాయణ, గొర్లి కుమారస్వామి, మేడపాటి రాము ,పల్లి మంగరాజు, అడారి వెంకట, జెట్టి నాగ వరప్రసాద్, కెకె.రాజు, బయలుపూడి హరగోపాల్ ఉన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి పంచాయతీ అచ్చయ్యపాలెం శివారులో ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను ఆదివారం సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు, వైసిపి సీనియర్ కార్యకర్త పెద్దాడ ఈశ్వరరావు, గ్రామ పెద్దల సమన్వయంతో అచ్చయ్యపాలెం ఎరుకమాంబ యూత్ ముందుకు వచ్చి శ్రమదానంతో తొలగించారు. గంటల తరబడి చెట్ల పొదలు తొలగిస్తూ, యువత గ్రామాభివృద్ధిపట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సామాజిక చైతన్యంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని గ్రామ పెద్దలు ప్రశంసించారు. గ్రామ భవితను మార్చేది యువత చేతుల్లోనే ఉందని, వారి సేవా స్ఫూర్తి ఇతరులకు ఆదర్శమని సర్పంచ్ వెంకటరమణ అభినందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో నాగేంద్ర స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. దొడ్డి నూకయ్య జ్ఞాపకార్థం కుమారుడు వెంకట సత్యనారాయణ, ఎల్లపు అప్పారావు జ్ఞాపకార్థం సత్యనారాయణ ప్రోత్సాహంతో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు డాక్టర్ జి రామ్మూర్తి, డాక్టర్ ఎస్ సురేష్, డాక్టర్ వై రాధిక, డాక్టర్ ప్రజ్ఞ, వై.రాజేష్, ఎ.సుధీర్, డాక్టర్ గంగాధర్, బి లక్ష్మీనరసింహం, శంకర్ ఫౌండేషన్ వైద్యులు పాల్గొని 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంపత్ హెల్త్‌కేర్ మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 17 మందిని కంటి ఆపరేషన్లుకు ఎంపికచేసి, విశాఖలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, నాగేంద్రస్వామి ఆలయం గౌరవ అధ్యక్షుడు దొడ్డి వెంకట సత్యనారాయణ,(బాబు), ఎల్లపు సత్యనారాయణ, ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, కోశాధికారి మద్దాల క్రాంతికుమార్, ఎల్లపు గోవింద, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పివి జగన్మోహనరావు, ఆళ్ల శ్రీరామచంద్రమూర్తి, దాడి భాస్కరరావు, శిలపరశెట్టి భాస్కరరావు పీలా రమణారావు, ఆడారి త్రినాధరావు, పీలా నాయుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పాడిపశువుల మృత్యువాత

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని పి.బోనంగి పంచాయతీలో వరుసగా పాడిపశువుల మృత్యువాతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన రెండు వారాల్లో గ్రామంలో ఐదు గేదెలు, ఆవులు అనారోగ్యంతో చనిపోయాయని స్థానికులు అంటున్నారు. స్థానిక రైతు యాసారపు నాగేశ్వరరావుకు చెందిన రూ. లక్ష విలువైన ఆవు మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎంపిటిసి డెక్క శ్రీనివాసరావు బాధిత రైతును పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లే సేవలు అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని శ్రీనివాసరావు మండిపడ్డారు. ఇప్పటికైనా వెటర్నరీ సిబ్బంది స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ అనూషను అడగగా, పి. బోనంగి పంచాయతీలో 3న సోమవారం వైద్యశిబిరాన్ని నిర్వహించి, అస్వస్థతతో ఉన్న పశువులకు సేవలు అందిస్తామన్నారు.

తలుపులమ్మ విగ్రహానికి విరాళం



ఆలయ కమిటీ నగదు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో గొబ్బూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయంలో అమ్మవారి విగ్రహానికి నిమ్మదల వెంకట వరలక్ష్మి, మజ్జి భారతమ్మ, బొద్దపు విజయమ్మ, కోన లక్ష్మి దేవి సత్యనారాయణ నలుగురు అక్కచెల్లెళ్లు కలిసి, తమ తల్లిదండ్రుల పేరిట రూ. 80 వేల విరాళం అందజేశారు. ఆదివారం ఆలయకమిటీకి విరాళం అందజేయగా, దాతలను అభినందించారు.

మత్స్యకారుల రిలే దీక్షలు @ 50 రోజులు

▶▶ బల్క్ డ్రగ్‌పై సడలని సంకల్పంతో పోరుబాట ▶▶ నిర్బంధాలు, ఆంక్షలు విధించినా అలుపెరగని ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ రద్దు చేయాలనే డిమాండ్‌తో మత్స్యకారులు తలపెట్టిన పోరుబాట సడలని సంకల్పంతో ముందుకు సాగుతుంది. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన శాంతియుత రిలే దీక్షలు ఆదివారం నాటికి 50వ రోజుకు చేరుకుంది. ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్ ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకోవడంతో మత్స్యకారులు వ్యతిరేకిస్తూ బానాన్ని ఎక్కిపెట్టారు. తమ ఉపాధి, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ ను ప్రభుత్వం రద్దు చేసే వరకు మత్స్యకారులంతా ఐక్యంగా పోరాటం చేయాలని నిర్ణయం తీసుకుని శాంతియుత రిలే దీక్షలను సెప్టెంబర్ 14వ తేదీనప్రారంభించారు. అప్పట్లో టెంట్ వేసుకునేందుకు అనుమతి లేదని పోలీసులు అడ్డగించారు.పోలీసులను ఎదిరించి టెంట్ వేయాలని ప్రయత్నించినప్పటికీ ఒప్పుకోలేదు. మత్స్యకారులంతా దృఢ సంకల్పంతో మూడు రోజుల పాటు ఎండను, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురి పై కేసులు నమోదు చేశారు. అనేక ఆంక్షలు పెట్టారు. అయినప్పటికీ మత్స్యకారులు భయపడకుండా తమ పోరాటాన్ని కొనసాగించారు. సెప్టెంబర్ 19న టెంట్ వేసుకునేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో టెంట్ వేసుకుని తమ ఆందోళనను కొనసాగించారు. సిపిఎం,సిపిఐ, వైసీపీ పార్టీల నేతలు మత్స్యకారులు తలపెట్టిన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.



ఆందోళన చేపడుతున్న మత్స్యకారులు

ఇప్పటికే ఆయా పార్టీల నేతలు రాజయ్యపేట వచ్చి మత్స్యకారులకు మద్దతునిచ్చి, అండగా ఉంటామని భరోసాను ఇచ్చారు. రాజయ్యపేట ప్రాంతంలో బల్క్ డ్రగ్ ఏర్పాటుకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా చేపడుతున్న పనులను సెప్టెంబర్ 24న మత్స్యకారులందరూ అడ్డగించారు. 25 తేదీని కూడా రోడ్డుపై బైఠాయించి తమ ఆందోళనను కొనసాగించారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్పందించి న్యాయం చేయాలంటూ పట్టుపట్టారు. అధికారులు హెూం మంత్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో, ఆమె వీడియో సందేశాన్ని పంపించారు.సెప్టెంబర్ 29న ఆమె రాజయ్యపేట వచ్చారు. బల్క్ డ్రగ్ ఏర్పాటుతో జరిగే నష్టాన్ని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. బల్క్ డ్రగ్ ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. గ్రామంలో కొంతమంది కమిటీగా ఏర్పడితే వారిని సీఎం, డిప్యూటీ సీఎం వద్దకు తీసుకు వెళ్తానని చెప్పి ఆమె బయలుదేరి వెళుతుండగా, మత్స్యకారులు ఆమె కాన్వాయ్ ని అడ్డుకున్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు పనులు ఆపుతామని హామీ ఇవ్వడంతో, శాంతించిన మత్స్యకారులు యధావిధిగా తమ రిలే దీక్షలను కొనసాగిస్తూ వచ్చారు. మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నాయకులను పోలీసులు నిర్బంధించడం, ఆంక్షలు పెట్టడంతో మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్టోబర్ 12వ తేదీన హైవేను నాలుగు గంటల పాటు నిర్బంధించారు. దీంతో కలెక్టర్ వచ్చి మత్స్యకారులతో మాట్లాడారు. గ్రామానికి వచ్చి మాట్లాడతానని ఆమె హామీ ఇవ్వడంతో మత్స్యకారులు శాంతించారు. హెూం మంత్రి కాన్వాయ్ ని అడ్డుకోవడం, హైవేను మత్సకారులు నిర్బంధించడం వంటి పరిణామాలు చోటు చేసుకోవడంతో రాజయ్యపేటలో పోలీసు బలగాలను మొహరించారు. సెక్షన్ 30 అమలులో ఉందని బయట వ్యక్తులను రాజయ్యపేట రానివ్వకుండా అడ్డుకున్నారు. అక్టోబర్ 24న జిల్లా కలెక్టర్ గ్రామానికి వచ్చి మత్స్యకారులతో చర్చలు జరిపారు. మత్స్యకారులందరూ బల్క్ డ్రగ్ వద్దంటే..వద్దు.. అని కలెక్టర్ కు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పి ఆమె వెనుదిరిగారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, పోలీసుల ఆంక్షలు, నిర్బంధాలకు భయపడేది లేదని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు.

6 నుంచి సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి - చింతపల్లి: కాఫీ తోటల కార్మికుల సమస్యల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 6 నుంచి సమ్మె తప్పదనిప్రభుత్వాన్ని, ఎపిఎఫ్‌డిసి యాజమాన్యాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. ఆదివారం చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ ఎపిఎఫ్‌డిసి కిన్నెర్ల కాఫీ తోటలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంపు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పండ్ల ధరలు పెరుగుదలపై సమ్మె నోటీసులిచ్చి 20 రోజులు గడిచినా ప్రభుత్వం, యాజమాన్యాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎపిఎఫ్‌డిసి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కాఫీ తోటలు నాశనమవుతున్నాయన్నారు.

నేడు హోం మంత్రి అనిత వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 3న సోమవారం ఉదయం 10 గంటల నుండి రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద హెూం మంత్రి అనిత నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో ప్రజలు తమ సమస్యలను నేరుగా హెూం మంత్రి దృష్టికి తీసుకురావచ్చునని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత వెంకటేష్

రైతన్నను ముంచిన మొంథా

▶▶ తుపానుతో నేలకొరిగిన బొప్పాయి, సరుగుడు
▶▶ తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు ▶▶ ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: మోంథా తుఫాన్ కి బుచ్చియ్యపేట మండలంలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. వరి పంట నీటిముంపులోనే ఉంది. బుచ్చయ్య పేటలో బొప్పాయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే పలు గ్రామాల్లో గల సరుగుడు మొక్కలు, బొప్పాయి మొక్కలు నేల కొరిగాయి. బుచ్చయ్యపేటకు చెందిన పాతాళ పాల బాబు అనే రైతు మాట్లాడుతూ.. తాను కౌలుకు సాగు చేస్తున్న 5 ఎకరాల బొప్పాయి పంట తుఫాన్‌కి కొంతభాగం నేల పాలు అయ్యిందన్నారు. మిగిలిన తోటలో నీరు ఆరే కొద్దీ బొప్పాయి మొక్కలకు మొదలు తెగులు వస్తుందని వాపోయాడు. సుమారుగా రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని ఆవేదన చెందాడు. బుచ్చియ్యపేటలోనే తాను సాగు చేస్తున్న 5 ఎకరాల సరుగుడు తోటకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపాడు. ఎదిగిన సరుగుడు మొక్కలు గాలివానకు నేల కొరిగాయని తెలిపారు. తుఫాను కారణంగా తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన చెందాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు.



నేల కూలిన సరుగుడు



బొప్పాయి తోటలు నేల కూలడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నరైతు



చెక్కును ఇస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -నర్సీపట్నం: మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన అడిగర్ల సన్యాసిరావు గుండెపోటుతో శనివారం మరణించాడు. ఇతను లారెన్స్ కంపెనీలో ఉద్యోగ పని చేస్తూ ఉండడంతో ఆ కంపెనీకి చెందిన యాజమాన్యం కుటుంబ సభ్యులకు 75000 ఆర్థిక సహాయం అందజేశారు. సన్యాసిరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎరకన్నపాలెం టిడిపి నాయకులు, కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తుపాన్ బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పుత్తడిగైరంపేట పంచాయతీలో తుఫాను బాధిత కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.నాయుడు, సర్పంచ్ పత్తి రమణ, టీడీపీ నాయకులు పుత్తడి నారాయణరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రూపాల శివ, తుమ్మగుంట అప్పలనాయుడు, డీలర్ పుత్తడి వెంకటలక్ష్మి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ: ఏపీటీఎఫ్ గొలుగొండ మండల శాఖ కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షులుగా సీహెచ్.నర్సింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా టీ.బ్రహ్మాజీ, గౌరవ అధ్యక్షులుగా జీ.మురళీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా డి.నూకరాజు, జిల్లా ఉపాధ్యక్షులు, ఎన్నికల అబ్జర్వర్ ఆర్‌విఆర్.శర్మ, జిల్లా కార్యదర్శి పడాల అప్పారావు, నర్సీపట్నం జోన్ ఇన్‌చార్జ్ కే.బాలచంద్రుడు, ఎం.శ్యామ్ సుందర్, ఎల్.రవికుమార్, కే.సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సింహమూర్తి, బ్రహ్మాజీ

పిఎసిఎస్‌లో అవకతవకలను బయట పెట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం: మాకవరపాలెం మండలం పిఎసిఎస్‌లో జరుగుతున్న అవకతవకలను బయట పెట్టాలని పిఎసిఎస్ సభ్యులు అడిగర్ల రాజబాబు ఆదివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో కోరారు. పిఎసిఎస్ సంఘ సమావేశం నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. కనీసం సంఘ సభ్యులకు కూడా తెలియపరచకుండా గతంలో ఉన్న ఉద్యోగులందరిని తొలగించి తమకు నచ్చిన వారిని నియమించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వేసిన కమిటీ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్థానిక టిడిపి నాయకులు పెత్తనం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉన్నత స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి బాబురావు, ఆంజనేయులు జమీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయ్యన్న

వెంకన్న కల్యాణోత్సవాలను జయప్రదం చేయాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి నర్సీపట్నం:తిరుమల తిరుపతి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకన్న కళ్యాణ వేడుకలు విజయవంతం చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. ఈనెల 3న సోమవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి జరిగే కళ్యాణ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు, ఇప్పటికే వేద పండితులు అంతా నగరానికి చేరుకున్నారని కన్నుల పండుగగా జరిగే కార్యక్రమానికి నియోజకవర్గ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వాలంటీర్లను నియమించామన్నారు, పోలీస్ యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం పండితులతో పాటు అధికారి యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు, ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం:డిసెంబర్ 26 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు రాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం కళాసి కాలనీలో ఏర్పాటు చేసిన సిఐటియు సమావేశంలో ఆదివారం కరపత్రం ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నడు లేని విధంగా ఈసారి విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత సభలు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మిక హక్కులపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు పాతిక లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు గత ఏడాది కాలంలో అనేక చట్టాలను నోచుకోకుండా ఉన్నారని, నాటి వైసిపి నేడు కూటమి ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల చట్టాలను అమలు చేయడంలో ఏ విధమైన చర్యలు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు వరహాలు బాబు, పెంటయ్య, వరబాబు, భద్రం పాల్గొన్నారు.

ఎపిటియు గౌరవ అధ్యక్షునిగా గొల్ల బాబూరావు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.దేముడు అధ్యక్షతన ఆదివారం జరిగాయి. గౌరవ అధ్యక్షునిగా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు ఎన్నికయ్యారు. గొల్ల బాబురావును ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కె. బ్రహ్మారెడ్డి, కె.జె. కృపానందం, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక మహోత్సవం


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి:అనకాపల్లి పుస్తక మహోత్సవానికి ఆదివారం అధికంగా సందర్శకులు తరలి వచ్చారు. ముఖ్యంగా తెలుగు సాహిత్యం, నవలలు, మాంగా కామిక్స్, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా కొనుగోలు చేశారు. పిల్లలకు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా బృంద దేశభక్తి గీతాలాపనలు, జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణ పోటీ, ఏకపాత్రాభినయం, థింసా నృత్యం వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అచ్యుతాపురం నుంచి వచ్చిన ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థినులు థింసా నృత్య ప్రదర్శన సాయంత్రం సమయంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.సాయంత్రం నిర్వహించిన "కవిసమ్మేళనం"లో జిల్లాలోని ప్రముఖ 18 మంది కవులు పాల్గొని తమ పద్యాలను, కవితలను చదివి వినిపించారు. కాగా 3వ తేదీన పుస్తక ప్రదర్శన ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది.

నేటి ముఖ్య కార్యక్రమాలు

మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యార్థుల కోసం చిత్రలేఖన పోటీ నిర్వహించనున్నారు. నిర్వాహకులు డ్రాయింగ్ షీట్లు ఇస్తారు. విద్యార్థులు తమ స్వంత రంగులు, పెన్సిళ్ళు తీసుకురావాలి.

చిత్రలేఖన పోటీ అంశాలు:

3-5 తరగతులు: మీకు నచ్చిన చిత్రం

6-7 తరగతులు: మీకు నచ్చిన సంప్రదాయ క్రీడ

8వ తరగతి నుండి పై తరగతులు: మీకు నచ్చిన శాస్త్ర అవిష్కరణ

పుస్తక ప్రియులు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు మరింతగా పాల్గొని పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

విశిష్ట కెరియర్ అభివృద్ధి సెషన్లు - రహ్మానుద్దీన్ షేక్ (రీసెర్చ్ స్కాలర్ విజయవాడ పుస్తక మహోత్సవ సొసైటీ సలహాదారు) ద్వారా నిర్వహించే రెండు కెరియర్ ప్రధాన సెషన్లకు ఆహ్వానం

సెషన్ 1: వ్యక్తిత్వ వికాసం అవకాశాలను వెలికితీయడం

విషయాలు: వ్యక్తిత్వ వికాసం, మంచి అలవాట్లు, అలసత్వంపై విజయం సాధించడమూ, స్వీయ అభివృద్ధి పద్ధతులు.

సెషన్ 2: ai ఉద్యోగాలను కబళిస్తున్న కాలంలో కెరియర్ ఎలా ముందుకు సాగాలి ?

విషయాలు: ఏఐ, ఎంఎల్, ఎల్ ఎల్ ఎం ప్రభావంలో మారుతున్న ఉద్యోగ విఫణిలో ముందుగానే సిద్ధమై ఉండటం, ఉద్యోగ అవకాశాలను పొందడం, యువతీ యువకులు ఎలా సన్నద్ధమవ్వాలి.


పుస్తక ప్రియుల తాకిడి

తేదీలు: నవంబర్ 3, 4, 2025

విద్యార్థుల వీలును బట్టి ఒక్కో సెషన్ మూడు స్లాట్లలో జరుగుతుంది.

- ఉదయం 11:00 - 12:00

మధ్యాహ్నం 2:00 - 3:00

రాత్రి 7:00 - 8:00

అలాగే అనకాపల్లి లాపింగ్ క్లబ్ వ్యవస్థాపకులు విన్నకోట బుచ్చిరాజు ఆధ్వర్యాన స్కిట్స్ నిర్వహిస్తారు.

సామాజిక స్పృహ కల్పించడంలో పుస్తకానికి ప్రత్యేక స్థానం

- ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్

ప్రజాశక్తి-అనకాపల్లి : సామాజిక స్పృహ కల్పించడంలో పుస్తకానికి ప్రత్యేక స్థానం ఉందని ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్ అన్నారు. అనకాపల్లి మున్సిపల్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న ఒకటవ అనకాపల్లి పుస్తక మహోత్సవం సందర్భంగా సాహితీ మిత్రుల సభలో ముఖ్యవక్తగా మాట్లాడారు. గతంలో చిన్నపిల్లలకు కథలు చెప్పే అవ్వలు తాతలు, తల్లిదండ్రులు ఉండేవారు. నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో పుస్తక మహోత్సవంలో ఎక్కువ మంది పిల్లలు కథల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. సెల్ఫోన్లు,ప టీవీలకు పరిమితమైపోతున్న తరుణంలో పిల్లలు కథలు చదవడం ద్వారా మంచి విషయాలు తెలుసుకోవచ్చని, సామాజిక రుగ్మతలను దూరం చేసే ప్రజా సాహిత్యం అనేక పరిష్కారాలు చూపుతుందన్నారు.


మాట్లాడుతున్న ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్

సంస్కారంతోపాటు మంచిని స్వీకరించేలా, అలాగే చెడును విసర్జించేలా పుస్తకం చేస్తుందన్నారు. . మనుషులు యంత్రాల్లాగా మారే ఈ పరిస్థితుల్లో అన్ని యాంత్రిక సంబంధాలే ఉంటున్నాయని, అటువంటి వాటిని దూరం చేసి మనిషికి ధైర్యాన్ని ఇచ్చేది పుస్తకం అన్నారు. పుస్తకం మనిషికి విశ్వాసం నింపుతుందని తద్వారా సంస్కారం, సమాజంలో మంచి మార్గం వైపు వెళ్లేలా పుస్తకం చేస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ఆదరిస్తున్న ప్రజలకు, నిర్వాహకులను అభినందించారు.

డిఏ పెంపులో కార్మికులకు ద్రోహం : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : కరువు భత్యాన్ని పెంచకుండా పాత డిఏ పాయింట్లనే కొనసాగించి ప్రకటించడం ద్వారా కూటమి ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు విమర్శించారు.ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గడచిన ఆరునెలలకు సంబంధించి గతనెల 31న ప్రకటించిన కరువుభత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సున్నాగా ప్రకటించడం దుర్మార్గమన్నారు.కనీస వేతన చట్టప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి పెంచాల్సిన డిఎను ప్రభుత్వం అటకెక్కించడంతో ఇప్పటికే మూడు వేతన పెంపు అవకాశాలను కార్మికులు కోల్పోయారన్నారు. 2014 ఏప్రిల్లోనూ టిడిపి ప్రభుత్వం ఇలాగే సున్నా చుట్టగా, కార్మికుల ఆందోళనతో దిగొచ్చి అప్పట్లో డిఎను పెంచిందన్నఇ, ఇపుడు మరోసారి అలాగే నాటకాలాడుతోందని మండిపడ్డారు. డిఏ పెంపుతో సంస్థల యజమానులపై తప్ప, రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి భారం ఉండదని, అయినా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతోకార్మికుల జీతాలు యాజమాన్యాలు తగ్గించుకునేలా రాష్ట్ర ప్రభుత్వ కుట్రను ఖండించారు. కరువుభత్యం సున్నా చేయడంతో కార్మికుడు నెలకు రూ. 765 నష్టపోతారన్నారు. గతంలో 10.50 పాయింట్లు డిఏ ఉండగా, 2006 నుండి సగానికి తగ్గించి 6.65 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ధరలు పెరుగుదలకు అనుగుణంగా కరువుభత్యం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే పోరాటానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

రాంబిల్లి : 72 రంగాల్లో పనిచేస్తున్న పారిశ్రామిక కార్మికులకు, ఆరు నెలలకోసారి పెంచాల్సిన కరువు భత్యాన్ని ఈసారి కూటమి ప్రభుత్వం పెంచకుండా, 50 లక్షల మంది కార్మికులకు అన్యాయం చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడునాయుడు మండిపడ్డారు. సున్నా పాయింట్ల డిఏ పెంపును నిరసిస్తూ ఆదివారం కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడుతూ,కార్పొరేట్ కంపెనీలు, పరిశ్రమల యాజమాన్యాల లాభాల కోసం కార్మికులకు డిఏ పెంచకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఐదేళ్లకోసారి వేతన సవరణ చేయకపోగా, ఇపుడు డిఎం పాయింట్లు పెంపులోనూ కార్మికులకు అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి, కార్మికులకు న్యాయం చేయకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు, శ్రీను, రమణ, నాగేష్, శివ, చిన్న, శంకరరావు, నూకరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మికులకు కరువుభత్యం పెంచాలి

విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు వెంటనే కరువుభత్యం పెంచాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరు మాసాలకుకరువుభత్యాన్ని అక్టోబర్ 31న రాష్ట్ర ప్రభుత్వం సున్నాగా ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో 72 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేసే 50 లక్షల మందికి చట్టప్రకారం ఈ కరువుభత్యం వర్తిస్తుందని తెలిపారు. కనీస వేతన చట్టప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు పెంచవలసిన కనీస వేతనాన్ని పెంచడం యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటికే మానివేశాయని పేర్కొన్నారు. 2014 ఏప్రిల్లో టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇదే విధంగా కరువు భత్యాన్ని సున్నా చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. డిఏ పెంచినా రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి భారమూ ఉండదని, కంపెనీల యజమానులే దాన్ని చెల్లిస్తారని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్) పేరుతో యజమానులు కార్మికులకు జీతాలు తగ్గించడానికి చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ కుట్ర అందులో దాగి ఉందని తెలిపారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్టు తెలిపారు.


రాంబిల్లిలో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్మికులు